క్లుప్తంగా

ఆ బీఈడీ కళాశాలకు వైవీయూ గుర్తింపు లేదు

వైవీయూ: జిల్లా పరిధిలోని ప్రొద్దుటూరు శ్రీకృష్ణ గీతాశ్రమంలో ఉన్న శ్రీ మలయాళస్వామి కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ)కు 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి నేటి వరకు యోగివేమన విశ్వవిద్యాలయం నుంచి ఎలాంటి గుర్తింపు (అఫిలియేషన్) లేదని విశ్వవిద్యాలయ కాలేజీ డెవలప్మెంట్ కౌన్సిల్ డీన్ ఆచార్య కె. రఘుబాబు ఒక ప్రకటన బుధవారం విడుదల చేశారు. సదరు కళాశాలలో బీఈడీ ప్రవేశాలు పొందే విద్యార్థులకు విశ్వవిద్యాలయం ఎలాంటి బాధ్యత వహించదని స్పష్టం చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. భవిష్యత్తులో న్యాయస్థానాల మార్గదర్శకం మేరకు విశ్వవిద్యాలయ నిర్ణయాన్ని తెలియజేస్తామన్నారు.

వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన



వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కడప కోటిరెడ్డిసర్కిల్ : వ్యాధి నిరోధక టీకాలను నిర్ణీత కాల వ్యవధిలో ఇవ్వడం వల్ల తల్లీ బిడ్డల మరణాలకు అడ్డుకట్టవేయవచ్చని నాగరాజుపేట అర్బన్ హెల్త్ ట్రైనింగ్ హెల్త్ ఎడ్యుకేటర్ ప్రసన్నలత తెలిపారు. బుధవారం కడప నగరం హాజి గఫూర్ వీధిలోని అంగన్వాడీ కేంద్రంలో కొనసాగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పర్యవేక్షించి శిక్షణా వైద్యులు, తల్లులు, గర్భవతులకు వ్యాధి నిరోధక టీకాలపై అవగాహన కల్పించారు. వైద్యుల సూచనల మేరకు ఆయా టీకాలను క్రమం తప్పక ఇప్పించాలన్నారు. కార్యక్రమంలో శిక్షణా వైద్యులు లావణ్య, నవ్యశ్రీ, రవికుమార్‌రెడ్డి, హసీనాఖానమ్, రామకృష్ణ నాయక్, ఆదినారాయణ, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సినీ సాహిత్యం ఉన్నతిని పెంచిన 'వేటూరి'



వేటూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తదితరులు

కడప కల్చరల్ : తెలుగు సినీ గీతాల ప్రముఖ రచయిత వేటూరి సుందర రామమూర్తి సినీ సాహిత్యపు ఉన్నతిని గణనీయంగా పెంచారని ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి అన్నారు. బుధవారం వేటూరి వర్ధంతిని పురస్కరించుకొని జిల్లా రచయితల సంఘం రాజీవ్ కల్చరల్ క్లబ్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆచార్య మూల మాట్లాడుతూ వేటూరి సినీ గీతాల్లో కూడా విశిష్టమైన కవిత్వాన్ని పండించి తెలుగు సినీ పాటలకు జాతీయ స్థాయిలో ఖ్యాతిని సంతరించి పెట్టారన్నారు. డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, రంగస్థలం నటులు విశ్వనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వేటూరి పాటలకు ప్రత్యేక ఒరవడి కనిపిస్తుందన్నారు. కార్యక్రమంలో రంగస్థల నటులు గంగయ్య, మందల మురళి, తిప్పలూరు ఓబులేసు, వీరదాసరి ప్రకాశం, జ్యోతి జార్జి, బి. బాలఓబయ్య, ఏ.గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉరుసు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం అల్మాస్‌పేట సర్కిల్‌వద్దగల గేసుదరాజ్ బందనవాజ్ దర్గాలో కొలువైన హజరత్ ఖ్వాజా సయ్యద్ షా అమినుద్దీన్ హుసేని ఖుదసస్రిహు వారి ఉరుసు మహోత్సవం గురువారం నుంచి నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం కడప అమీన్ పీర్ దర్గా పీఠాధిపతి హజరత్ ఖ్వాజా సయ్యద్ షా ఆరిఫుల్లా మహ్మద్ హుసేనీ సాహెబ్ గంధాన్ని సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారన్నారు. శుక్రవారం ఉరుసు మహోత్సవం ఘనంగా జరుగుతుందన్నారు. రాత్రి ప్రముఖ గాయకులచే ఖవాలీ కచేరీ ఉంటుందన్నారు. శనివారం సాయంత్రం 5 గంటలకు తహలీల్ ఫాతెహాతో ఉత్సవాలు ముగుస్తాయని వారు వివరించారు.

శేష వాహనంపై మోక్ష నారాయణుడు

కమలాపురం : మండల పరిధిలోని శ్రీ రామాపురం పుణ్యక్షేత్రంలో శ్రీ మహాలక్ష్మీ సమేత మోక్ష నారాయణస్వామి, శ్రీ వల్లీదేవసేన సమేత షణ్ముఖ సుబ్రమణ్యస్వామి, సంజీవిని సహిత శ్రీ వీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఆలయ వ్యవస్థాపకులు సత్య సాయినాథ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. రెండవ రోజైన బుధవారం సాయంత్రం శేష వాహనంపై కొలువుదీరిన శ్రీ మోక్ష నారాయణస్వామి ఊరేగింపు ఘనంగా జరిగింది. ఆలయ మాడ వీధుల్లో మేళతాళాలతో, భాజా భజంత్రీలతో స్వామివారి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అశ్వ వాహనంపై కొలువుదీరిన శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వరస్వామి ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. అర్చకులు ఉదయం స్వామి వార్లకు అరుణ పారాయణం, అర్చనలు, రుద్రాభిషేకం నిర్వహించారు. వివిధ హోమాలను నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వార్లను దర్శించుకున్నారు.

గురి పెడితే..గుండు తగలాల్సిందే..!

– ఉత్సాహంగా సాగుతున్న రైఫిల్‌షూటింగ్ వేసవి శిక్షణ శిబిరం

లక్ష్యంపై దృష్టి.. చెదరని ఏకాగ్రత.. గురిపెడితే గుండుతప్పకూడదన్న సంకల్పం... వెరసి ఉత్తమశ్రేణి రైఫిల్ షూటర్స్‌గా తీర్చిదిద్దుతోంది.. కడప నగరం బిల్టప్ సమీపంలో షూటింగ్ అకాడమీలో నిర్వహిస్తున్న రైఫిల్‌షూటింగ్ వేసవి శిక్షణ శిబిరంలో చిన్నారులు రైఫిల్స్ చేతబట్టి షూటింగ్ సాధన చేస్తున్నారు.



కడప స్పోర్ట్స్: కడప నగరానికి చెందిన రైఫిల్ షూటింగ్ జాతీయ క్రీడాకారుడు జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో రైఫిల్ షూటింగ్ శిక్షణ శిబిరం ఉత్సాహంగా సాగుతోంది. కడప నగరంలోని బిల్టప్ సమీపంలో జాకీర్ రైఫిల్ షూటింగ్ అకాడమీలో నిర్వహిస్తున్న శిక్షణకు చిన్నారుల నుంచి చక్కటి స్పందన లభిస్తోంది.

– వేసవి సెలవులు కావడంతో ఏదో ఒక క్రీడాంశంలో రాణించాలనుకునే చిన్నారులకు ఈ అకాడమీ చక్కటి వేదికగా నిలుస్తోంది. జాతీయస్థాయిలో పతకాలు సాధించిన జాకీర్ హుస్సేన్ స్వీయపర్యవేక్షణలో నిర్వహించే ఈ అకాడమీలో వేసవి శిక్షణలో భాగంగా ఉదయం, సాయంత్రం వేళల్లో చిన్నారులకు ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు.

– శిక్షణలో భాగంగా క్రమశిక్షణ, ఏకాగ్రత పెంపు, బేసిక్స్ ఆఫ్ షూటింగ్, మైండ్ కంట్రోల్, కాంపిటీటివ్ మైండ్, హోల్డింగ్ పొజిషన్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు.

– 10 సంవత్సరాల వయసు పైబడిన విద్యార్థులకు ఇక్కడ శిక్షణ ఇవ్వడంతో పాటు వెపన్స్‌తో శిక్షణ నేపథ్యంలో ముందుగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజేస్తున్నారు. ఎయిర్ రైఫిల్, ఎయిర్ పిస్టల్ విభాగాల్లో ఇక్కడ శిక్షణ లభిస్తుండటంతో చిన్నారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేందుకు వస్తుండటం విశేషం. వీరితో పాటు రెగ్యులర్ క్రీడాకారులు సైతం సాధన చేస్తూ.. శిక్షణ శిబిరానికి విచ్చేసేవారికి మార్గదర్శకంగా ఉంటున్నారు.

జాతీయస్థాయిలో పతకం సాధించేలా..



కడప నగరంలోని జాకీర్‌హుస్సేన్ రైఫిల్ షూటింగ్ అకాడమీలో గత కొద్ది సంవత్సరాలుగా శిక్షణ పొందుతున్నాను. ఇప్పటి వరకు పలు రాష్ట్రస్థాయి, సౌత్‌జోన్ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. జాతీయస్థాయిలో రాణించడమే లక్ష్యం. – మనస్విని, 10వ తరగతి విద్యార్థిని, కడప

నాన్న ప్రోత్సాహంతో..



నాన్న ప్రోత్సాహంతో అక్క స్ఫూర్తితో రైఫిల్‌షూటింగ్ శిక్షణకు వస్తున్నాను. ఇక్కడ శిక్షణ చక్కగా అందిస్తున్నారు. చదువుతో పాటు క్రీడలకు సమ ప్రాధాన్యత ఇస్తున్నాం. రైఫిల్‌షూటింగ్ క్రీడను ప్రొఫెషనల్‌గా ఎంపిక చేసుకుని సాధన చేస్తున్నా.
– బహుళ, 8వ తరగతి విద్యార్థిని, కడప

చీనీ టన్ను ధర రూ.39 వేలు



పులివెందులలో కొనుగోలుకు సిద్ధంగా ఉన్న చీనీకాయలు

పులివెందుల రూరల్ : వ్యవసాయ మార్కెట్‌యార్డుకు రైతులు పండించిన చీనీకాయలను తరలించి అక్కడ మార్కెట్‌యార్డు అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహిస్తారు. వేలంపాటలో మొదటి ధర రకం రూ.39 వేలు, మధ్యరకం కాయలు రూ.27 వేలు ధర పలికిందని రైతులు అంటున్నారు. మార్కెట్‌యార్డు లేనప్పుడు 10 టన్నులకు 2 టన్నులు వ్యాపారస్తులకు సూట్ ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదని రైతులు అంటున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల సహకారంతో పులివెందులలో చీనీకాయల కొనుగోలు మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. చీనీకాయల మార్కెట్‌లో సూట్ లేకుండా పండించిన పంటలను అమ్ముకుని డబ్బులు తీసుకుంటున్నట్లు రైతులు అంటున్నారు. తోటల్లో చీనీకాయలు తక్కువ ఉంటే వ్యాపారస్తులు వచ్చేవారు కాదని, వచ్చినప్పటికీ ఇష్టమొచ్చిన విధంగా ధరలు అడిగేవారని గత్యంతరం లేక ఇవ్వాల్సిన పరిస్థితి ఉండేదని రైతన్నలు అంటున్నారు. ప్రస్తుతం రైతులు కాయలు తక్కువ ఉన్నప్పటికీ ట్రాక్టర్లు, ఆటోలలో చీనీకాయలను మార్కెట్‌కు తీసుకువచ్చి సూట్ లేకుండా అమ్ముకుని డబ్బులు చేతపట్టుకుని వెళ్తున్నారు.

వరదనీటి కాలువ పనులు పూర్తి చేయాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో వరదనీటి కాలువల నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేయాలని నగరపాలక కమిషనర్ జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా ఆయన గురుకుల్ విద్యాపీఠ్, జిల్లా కోర్టు, మహాప్రస్థానం శ్మశానవాటిక, మున్సిపల్ స్టేడియం, ఎస్‌బీఐ కాలనీల వద్ద నిర్మిస్తున్న కాలువలను పరిశీలించారు. కాలువకు రోడ్డుకు మధ్య ఉన్న గ్యాప్‌ను వెట్ మిక్స్‌తో మరమ్మతులు చేయాలన్నారు. ఆర్టీసీ బస్టాండు ఔట్ గేట్ నుంచి వరదనీటి కాలువ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. కోటిరెడ్డి సర్కిల్ వద్ద డ్రైన్‌పై స్లాబ్ వేయాలన్నారు. మురళి థియేటర్ జంక్షన్ నుండి కోటిరెడ్డి సర్కిల్ జంక్షన్ వరకు డ్రైన్ ఏర్పాటు పనులను ప్రారంభించాలన్నారు. మే 30 నాటికి పూర్తి స్థాయిలోవరదనీటి కాలువల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. మహాప్రస్థానం శ్మశాన వాటికలో సిబ్బందికి క్వార్టర్స్ నిర్మించాలన్నారు. టాయ్‌లెట్లు, ఎలక్ట్రిక్ పనులు, అంతర్గత రోడ్లు పూర్తి చేయాలన్నారు. ఈ పనులు రెండు మాసాల్లో పూర్తి చేయాలన్నారు. మున్సిపల్ స్టేడియంలోని బాస్కెట్ బాల్ కోర్టు నందు నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. హాకీ గ్రౌండ్ నందు డ్రైన్ ఏర్పాటు పనులను పూర్తి చేసి ఔట్‌లెట్‌కు కనెక్షన్ ఇవ్వాలని సూచించారు. గ్యాలరీ ఏర్పాటు పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు. స్కేటింగ్ రింగ్ పనులను మే 30 నాటికి పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రత్నాల రాజు, డీఈలు వేణుగోపాల్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న నగరపాలక కమిషనర్ ప్రవీణ్‌చంద్

కేతు రచనలు ఎంతో గొప్పవి

కడప కల్చరల్ : కేతు విశ్వనాథరెడ్డి రచనలు ఎంతో గొప్పవని, అంతకన్నా వ్యక్తిగా ఆయన గొప్పవారని కథారచయిత పాలగిరి విశ్వప్రసాద్ తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానిక సింగపూర్ టౌన్ షిప్‌లో ఎస్‌టీఎం టౌన్ షిప్ సోషియో కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రసిద్ధ రచయిత, సాహిత్య విమర్శకులు కేతు విశ్వనాథరెడ్డి ప్రథమ వర్ధంతి సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సంస్మరణ సభకు బండి రాఘవరెడ్డి అధ్యక్షత వహించారు. పాలగిరి విశ్వప్రసాద్ మాట్లాడుతూ కేతు విశ్వనాథరెడ్డి కథలన్నిటికీ ప్రాతినిధ్యం వహించే కథ 'నమ్ముకున్న నేల' అని చెబుతూ, ఆ కథ అభివృద్ధిని డొల్లతనంపై అనేక ప్రశ్నలు లేవనెత్తిందన్నారు. ఎస్.రెడ్డి మాట్లాడుతూ తాను ఈ కాలనీకి రాగానే కేతు విశ్వనాథరెడ్డితో ఎంతో సమయం గడపాలని, ఎన్నో మాట్లాడి తెలుసుకోవాలని అనుకున్నానన్నారు. కానీ దురదృష్టవశాత్తు తాను వచ్చిన కొన్ని రోజులకే ఆయన దూరమయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టర్ మనోహర్ మాట్లాడుతూ 'నమ్ముకున్న నేల' కథను కేతు విశ్వనాథరెడ్డి 1996లో రాస్తే ఇటీవల అదే కథాంశంతో ఒక మళయాళి సినిమా వచ్చిందని, ఆ విషయం చెబుతూ విశ్వనాథరెడ్డితో తొలి పరిచయం చేసుకున్నానని గుర్తు చేసుకున్నారు. సభ నిర్వాహకులు వై.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కేతు కథల కన్నా ఆయన వ్యక్తిత్వం చాలా గొప్పదని కొనియాడారు. చాలా మంది రచయితల్లో రచనలు గొప్పగా ఉండొచ్చుగానీ వ్యక్తిత్వం రచనలంత గొప్పగా ఉండకపోవచ్చన్నారు. కేతు విశ్వనాథరెడ్డి వ్యక్తిగా గొప్పవారన్నారు. సమావేశంలో ఎస్‌టీఎం సోషియో కల్చరల్ అసోసియేషన్ కార్యదర్శి గోపిదేశి మధుసూదన్‌రావు, మాజీ ఎంపీ మూలె రామమునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్త

జీవ వైవిధ్యం... మానవాళి మనుగడకు వరం

కడప కల్చరల్ : ప్రకృతిలోని జీవ వైవిధ్యం మానవాళి మనుగడకు వరం లాంటిదని జన విజ్ఞాన వేదిక సీనియర్ నాయకులు పి.వెంకటేశ్వర్లు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో కడప నగరం ఆర్కే నగర్‌లోని ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో నగర కమిటీ విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరం బుధవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రకృతిలో వైవిధ్య భరితమైన ప్రాణులు మనుగడ సాగిస్తున్నాయని, మానవాళితో కలిసి వాటి జీవన క్రమమే వైవిధ్యమని తెలిపారు. వాతావరణ కాలుష్యం కారణంగా ఎన్నో రకాల జీవజాతులు నశించిపోతున్నాయని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపైనే ఉందన్నారు. జేవీవీ జిల్లా కోశాధికారి సమీర్‌బాష మాట్లాడుతూ అడవులు నశించిపోవడానికి వాతావరణ కాలుష్యమే ప్రధాన కారణమని, దీంతో భూమి వేడెక్కిపోతోందని, క్రిమి కీటకాలు, అందులో తేనెటీగలు నశించిపోవడం ప్రమాదకరమన్నారు. నగర ప్రధాన కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ రేడియో తరంగాల కారణంగా అనేక పక్షులు ప్రమాదంలో పడ్డాయన్నారు. కార్యక్రమంలో జేవీవీ సమత కార్యదర్శి కామేశ్వరమ్మ, సిటీ ప్రధాన కార్యదర్శి కిరణ్‌కుమార్, రీసోర్స్ పర్సన్లు శ్రీనివాసులు, డాక్టర్ చంద్రప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న చిన్నారులతో రీసోర్స్ పర్సన్లు

వైభవంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని చిన్నదాసరిపల్లె గ్రామ సమీపంలోని వెయ్యినూతలకోన క్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి జయంతి ఉత్సవాలు వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహహరిప్రసాద్, వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, వేదపారాయణం, మహామంగళహారతి, రాత్రి హన్మత్ వాహన సేవ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి కొన్నేర్లల్లో స్నానాలు అచరించి స్వామివారికి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేడు సూర్యప్రభ వాహన సేవ


నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సూర్యప్రభ వాహన సేవ, శ్రీచక్ర పెరుమాళ్ సేవ, ఉంజల్‌సేవ, రాత్రికి గరుడసేవ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : స్థానిక ముద్దనూరు రోడ్డులోని వాసవి కాలనీలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో బుధవారం లక్ష్మీనరసింహస్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రంను పురష్కరించుకుని ఉదయం ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాభిషేకం అనంతరం భక్తులకు స్వామి వారి దర్శనాన్ని కల్పించారు. సాయంత్రం స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోయుక్తంగా మంగళ వాయిద్యాల నడుమ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అల్పాహారం అందజేశారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్నారు.



హన్మత్ వాహన సేవలో లక్ష్మీనసింహస్వామి



లక్ష్మీనరసింహస్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

గజవాహనంపై అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం గజవాహనంపై ఊరేగారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి, రాజరాజేశ్వరి అమ్మవారికి విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. సాయంత్రం గంగాగౌరి సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గజవాహనంపై కొలువు దీర్చారు. విశేష పూజాకార్యక్రమాల అనంతరం పురవీధుల్లో శివనామస్మరణల మధ్య ఊరేగించారు. దారివెంబడి భక్తులు కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులు ఇచ్చి భక్తి శ్రద్ధలతో పూజించారు.



హనుమంత వాహనంపై చెన్నకేశవుడు

రాజుపాళెం : వెల్లాల బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి హనుమంతుడి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి విగ్రహాలను గ్రామంలోని పురవీధుల్లో ఊరేగించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. చైర్మన్ జగదీశ్వర రెడ్డి, ఈట నరసయ్య, బొల్లవరం వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ గోనా ప్రభాకర రెడ్డి, వెల్లాల ఆలయ మాజీ చైర్మన్ జనార్దన్ రెడ్డి, జంగంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, భక్తులు స్వాముల వారిని దర్శించుకున్నారు.



గొడవలకు పాల్పడితే కఠిన చర్యలు



పాతసంగటిపల్లెలో గ్రామస్తులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ నాగరాజు



చెన్నూరులో గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ పార్థసారథి

పెండ్లిమర్రి : ఎన్నికల కౌంటింగ్ అనంతరం గ్రామాల్లో గొడవలకు, అల్లర్లకు పాల్పడితే అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని కడప రూరల్ సీఐ నాగరాజు హెచ్చరించారు. మండలంలోని పాతసంగటిపల్లె గ్రామంలో బుధవారం పోలీసులు నాకాబంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామస్థులతో మాట్లాడారు. ఎన్నికల కౌంటింగ్ తర్వాత ఏపార్టీ గెలిచిన టపాసులు పెల్చడం, ర్యాలీలు, ఊరేగింపులు చేయరాదన్నారు. ఎవరైన అలా చేసి గొడవలు సృష్టిస్తే అటు వంటి వారిపై కఠిన చర్యలతో పాటు గ్రామ బహిష్కరణ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐ హరిప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.

చెన్నూరులో నాకాబంది

చెన్నూరు : జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు బుధవారం చెన్నూరులో సీఐ పార్థసారథి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది లక్ష్మీ నగర్, సరస్వతి నగర్, రాజుల కాలనీలోని అనుమానితులైన వారి ఇళ్లను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి వ్యవహరించాలన్నారు. ఎన్నికల కౌంటింగ్ సమయంలో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలకు పాల్పడరాదన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం మండలంలోని చిన్నమాచుపల్లె, కడప–కర్నూలు జాతీయ రహదారిలో వాహనాల తనిఖీలు చేపట్టారు.

ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొంటాం

జమ్మలమడుగు : పట్టణంలో రాజకీయ పార్టీల నాయకులు దౌర్జన్యాలకు పాల్పడితే తాము ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొవటానికి సిద్ధంగా ఉన్నామని ప్రొబిషనరి డీఎస్పీ శ్రీకాంత్ తెలిపారు. బుధవారం పట్టణంలోని పాతబస్టాండ్‌లో మాక్ డ్రిల్ పోలీసు బలగాలతో నిర్వహించారు. అనంతరం డీఎస్పీ మాట్లాడుతూ జూన్ 4వ తేదీ జరిగే కౌంటింగ్ తర్వాత పట్టణంలో ఎలాంటి గొడవలు జరిగిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గ వ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంటుందని ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ఇప్పటికే రౌడీషీటర్లు, గ్రామంలో సమస్యలు సృష్టించేవారిపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. తాము లాఠీ చార్జీతో పాటు, కాల్పులు చేయటానికి కూడా వెనుకాడబోమని హెచ్చరికలు జారీ చేశారు. అనంతరం పట్టణంలో పోలీసు బలగాలతో మార్చ్‌ఫాస్టు నిర్వహించారు.

గంట సేపు అయోమయంలో ప్రజలు..

ఉన్న ఫలంగా పట్టణంలోని పాతబస్టాండ్‌లో పోలీసు బలగాలు భారీగా వచ్చి చేరడంతో ప్రజలు భయాందోళన చెందారు. ఆర్టీసీ బస్సులను పాత బస్టాండ్‌కు రాకుండా ఆర్టీసీ బస్టాండ్‌కు పరిమితం చేయడంతోపాటు వచ్చే వాహనాలను బైపాస్ రోడ్డు నుంచి పంపిస్తుండటంతో పట్టణంలో ఏమి జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. పాత బస్టాండ్‌లో పోలీసులు ప్రత్యేక బలగాలతో డ్రిల్ చేస్తున్నారని తెలుసుకున్న ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆనంద్, సీఐలు కరుణాకర్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



జమ్మలమడుగు పట్టణంలో మాక్ డ్రిల్ నిర్వహిస్తున్న పోలీసులు